సాక్షి విశాఖపట్నం

బుధవారం । 9 । అక్టోబర్ । 2024



ఇన్‌చార్జుల ఏలు'బడి'లో.!

జిల్లా సమగ్ర శిక్ష అభియాన్‌లో కీలకమైన పోస్టుల్లో ఇన్‌చార్జులు ఉండటంతో.. విద్యా శాఖ కార్యక్రమాలపై పర్యవేక్షణ కరువైంది. IIలో



భీమిలి కొబ్బరికి యమ క్రేజ్

భీమిలి తీరప్రాంత కొబ్బరినీటికి ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు ఫిదా అవుతున్నారు. వ్యాపారులు బొండాలపై దృష్టి సారిస్తున్నారు. IIలో



విజయలక్ష్మిగా కనకమహాలక్ష్మి IIలో

న్యూస్‌రీల్

సింహగిరిపై నేడు ఆయుధపూజ



అప్పన్న ఆయుధాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న విజయదశమి మహోత్సవాల్లో భాగంగా మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయుధ పూజ నిర్వహించనున్నారు. ఆలయంలో కొలువైన సింహవల్లీ తాయారు సన్నిధిలో ఉదయం స్వామి ఆయుధాలైన కత్తి, ధనస్సు, బాణం, బాకు తదితర వాటిని ఉంచి పూజ చేస్తారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో విజయదశమి రోజు వరకు ఈ ఆయుధాలు ఉంచనున్నారు. ఈ మేరకు ఆలయ వైదిక అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఎయిర్‌పోర్టులో ఈవీ చార్జింగ్ స్టేషన్



ఈవీ చార్జింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయంలో ఎలక్ట్రిక్ వాహనాలకు ఉచితంగా చార్జింగ్ చేసుకునే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఎయిర్‌పోర్టులోని 3వ లైన్‌లో ఈ ఉచిత చార్జింగ్ స్టేషన్‌ను డైరెక్టర్ రాజారెడ్డి మంగళవారం ప్రారంభించారు. వెయిటింగ్ సమయంలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వాహనదారులకు ఆయన సూచించారు.



ఆశ్రమం భూముల్లో ఫుడ్ కోర్టు సెంటర్లు



బాక్స్ క్రికెట్

ఆశ్రమం భూములు హాంఫట్!

డ్రైవ్ ఇన్ పేరుతో ఫుడ్ కోర్టులు, క్రికెట్ కోచింగ్, జిమ్ సెంటర్ ఏర్పాటు

- సీఆర్‌జెడ్ ప్రాంతంలో నిర్మాణాలు
- టీడీపీ ఎమ్మెల్యే అండదండలతో ఇష్టారాజ్యంగా నిర్వహణ
- సుప్రీం తీర్పు నేపథ్యంలో నామమాత్రంగా కట్టడాల తొలగింపు
- జనసేన ఎమ్మెల్యే ఫోన్‌తో వెనక్కి తగ్గిన జీవీఎంసీ సిబ్బంది

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

పేదలకు విద్య, వైద్యం అందించేందుకు ఏడు దశాబ్దాల క్రితం ప్రభుత్వం కేటాయించిన భూముల్లో వాణిజ్య కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. ఫుడ్ కోర్టులు, జిమ్ సెంటర్, క్రికెట్ సెంటర్లను ఏర్పాటు చేసి భారీగా అద్దెలు వసూలు చేసుకొని జేబులు నింపుకుంటున్నారు. బీచ్‌రోడ్‌లో చినవాల్తేరు వద్ద శాంతి ఆశ్రమానికి కేటాయించిన 10 ఎకరాల భూమిలో సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టారు. అయినా చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకాడారు. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోని భూములను ఆశ్రమానికి అప్పగించాలంటూ కోర్టులు ఇచ్చిన ఆదేశాలను సైతం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు కారణం సదరు నిర్వాహకులకు అధికార తెలుగుదేశం ఎమ్మెల్యే అండదండలుండటమే. మరోవైపు సుప్రీంకోర్టు ఈ అక్రమ కట్టడాలను తొలగించాలని తాజాగా ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం జీవీఎంసీ సిబ్బంది పెట్రోల్ బంకుల్లో నిర్మాణాలను తొలగించే ప్రయత్నం చేస్తుండగా.. జనసేన ఎమ్మెల్యే రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. సదరు ఎమ్మెల్యే ఫోన్‌తో జీవీఎంసీ సిబ్బంది నామమాత్రంగా కట్టడాల తొలగింపు చేపట్టి వెనక్కి వెళ్లారు. ఈ వ్యవహారంపై టీవీ చర్చల్లో బాగా హడావుడి చేసిన ఓ జనసేన నేత.. కూటమి **ఎమ్మెల్యే ఫోన్‌తో చల్లబడిపోయినట్టు తెలుస్తోంది. మరో జనసేన నేత మాత్రం సుప్రీంకోర్టు ఆదేశా**లను తుంగలో తొక్కడంపై మరోసారి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

ఎమ్మెల్యేల జోక్యంతో..

శాంతి ఆశ్రమం భూముల వ్యవహారంలో.. నెలనెల అద్దెల రూపంలో, అడ్వాన్సుల రూపంలో పొందుతున్న సదరు నిర్వాహకుల వెనుక కూటమి ఎమ్మెల్యే అండదండలున్నట్టు తెలుస్తోంది. అందువల్లే స్థానిక అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని సమాచారం. సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా కాంక్రీట్ నిర్మాణాలున్నాయని ఫిర్యాదులు వచ్చిన వెంటనే రాత్రికి రాత్రి వెళ్లి తొలగిస్తున్న జీవీఎంసీ అధికారులు.. సుప్రీంకోర్టు ఆదేశాలున్నా నామమాత్రంగా తొలగింపు చేపట్టి మిన్నకుండిపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఈ ఆశ్రమ భూముల వ్యవహారాన్ని కూటమికి చెందిన ఒక నేత కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మరో కూటమి నేత మీడియా ముందుకు వచ్చి విమర్శలు గుప్పించారు. అయితే ఎమ్మెల్యే జోక్యంతో ఒక నేత నోరు మూసుకుపోయినట్టు తెలుస్తోంది. సదరు నేతతో సమావేశమైన నిర్వాహకులు ఒప్పందానికి వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. మరోవైపు జనసేన ఎమ్మెల్యే ఒకరు నేరుగా జీవీఎంసీ అధికారులను అటువైపు చూడవద్దంటూ ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై మరోసారి సుప్రీంకోర్టు తలుపుతట్టేందుకు కొద్ది మంది సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

అయితే పెట్రోల్ బంక్ స్థలానికి శాంతి ఆశ్రమానికి సంబంధం లేదని పెట్రోల్ బంక్ నిర్వాహకులు చెబుతున్నారు. జీవీఎంసీ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అనధికారిక చర్యలు చేపట్టిందని అంటున్నారు.

వాస్తవానికి శాంతి ఆశ్రమానికి ఒక లక్ష్యంతో ఇచ్చిన భూమిని కాస్తా వ్యాపారంగా మార్చేశారు. ప్రభుత్వ లక్ష్యానికి భిన్నంగా భూమిని వినియోగిస్తే వెంటనే కేటాయింపును రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. శాంతి ఆశ్రమానికి కేటాయించిన భూమిని వ్యాపార అవసరాలకు వినియోగించడమే కాకుండా.. రోడ్డు నిర్మాణంలో ఆశ్రమం భూమి

నష్టపరిహారమూ కాజేశారు..!

కొంత పోయిందంటూ నష్టపరిహారాన్ని సైతం కొద్ది మంది అనధికారికంగా కాజేసినట్టు తెలుస్తోంది. అధికారులు కూడా కళ్లు మూసుకుని నష్టపరిహారాన్ని అందజేశారు. మరోవైపు వైజాగ్ డ్రైవ్ ఇన్ పేరుతో ఫుడ్ కోర్టులు, క్రికెట్ కోచింగ్ సెంటర్, జిమ్ సెంటర్, పెట్రోల్ బంకు వంటి వాణిజ్య కార్యకలాపాల నిర్వహణ కోసం పలువురు ప్రైవేటు వ్యక్తులకు అద్దెకు కేటాయించడం గమనార్హం. ఈ అద్దెల పేరుతో భారీగా జేబు నింపుకుంటున్న సదరు నిర్వాహకుల వెనుక కూటమి ఎమ్మెల్యే భరోసా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ఇదీ ఆశ్రమం కథ..!

70 ఏళ్ల క్రితం స్థానికంగా ఉన్న ప్రజలకు విద్య, వైద్య సౌకర్యాలను కల్పించే లక్ష్యంతో శాంతి ఆశ్రమానికి బీచ్ రోడ్‌లో సముద్రతీరానికి దగ్గరలో సర్వే నెంబరు 51, 52, 52, **54ల్లో 10 ఎకరాల భూమిని కేటాయించింది. స్వామి ఓంకార్ ఈ ఆశ్రమాన్ని నిర్వహించేవారు. ఆయన చనిపోయిన తర్వాత దత్తత పేరుతో కొద్ది మంది అధికారం చెలాయిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఆశ్రమానికి ఇచ్చిన భూములపై దత్తత పేరుతో అధికారం చెలాయించకూడదని కోర్టు ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. ప్రస్తుతం కొద్దిపాటి స్థలంలో పాఠశాల, డిస్పెన్సరీ నడుస్తోంది. మిగతా స్థలాన్ని వాణిజ్య అవసరాలకు వినియోగించడం ప్రారంభించారు. ఇది నిబంధనలకు విరుద్ధంగా ఉందని కూటమి నేత జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.**



కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఫుడ్ కోర్టు సెంటర్లు



పెట్రోల్ బంక్‌లోని నిర్మాణాలను పొక్లెయిన్‌తో కూల్చివేస్తున్న జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

'కరెన్సీ' దుర్గ

రూ.50 లక్షలతో అమ్మవారికి అలంకరణ



కరెన్సీ నోట్ల ధగధగల్లో దుర్గాలమ్మ

అక్కిరెడ్డిపాలెం: గవరజగ్గయ్యపాలెంలోని శ్రీ దుర్గాలమ్మ అమ్మవారు మంగళవారం లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ప్రతినిధులు రూ.50 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారితో పాటు గర్భగుడిని అలంకరించారు. రూ.500, రూ.200, రూ.100, రూ.50, రూ.20, రూ.10 నోట్లను వినియోగించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రోజూ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

కేజీబీవీల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు

విశాఖ విద్య: జిల్లాలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో వంట మనిషి, వాచ్‌మెన్, చౌకీదార్ పోస్టులను అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేస్తున్నట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఆనందపురం, భీమునిపట్నం, పద్మనాభం, రెడ్డిపల్లి అగ్రహారం కేజీబీవీల్లో ఈ పోస్టులు ఉన్నాయన్నారు. ఈ నెల 15లోపు ఆయా మండలాల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఒడిశా వ్యాపారి ఎంట్రీ.. సిండికేట్‌కు షాక్



- 30 షాపులకు దరఖాస్తు చేసిన ఒడిశా మద్యం వ్యాపారి
- నోయిడా నుంచి రంగంలోకి మరి కొందరు..
- ఎక్కువ దరఖాస్తులు రాకుండా మద్యం వ్యాపారుల ప్రయత్నాలు
- తాజా పరిణామాలతో కంగుతున్న విశాఖ మద్యం సిండికేట్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

విశాఖలో మద్యం వ్యాపారంపై ఆధిపత్యం చెలాయించాలనుకున్న సిండికేట్‌కు తీవ్ర పోటీ ఎదురవుతోంది. ఒడిశాకు చెందిన వ్యాపారి వివేక్ సాహు సిండికేట్‌కు ఊహించని షాక్‌నిచ్చారు. నోయిడాకు చెందిన కొంత మంది మద్యం వ్యాపారులు కూడా ఇక్కడ వ్యాపారంపై కన్నేశారు. విశాఖలో మద్యం దుకాణాల కోసం కొంత మంది సిండికేట్‌గా ఏర్పడి ఎక్కువ దరఖాస్తులు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎవరెవరు ఏయే షాపులను దక్కించుకోవాలనే విషయంపై సోమవారం రాత్రి సీతమ్మధారలోని ఒక మద్యం వ్యాపారి గెస్ట్‌హౌస్‌లో సమావేశమయ్యారు. ప్రధానంగా 8 మంది మద్యం సిండికేట్ల మధ్య ప్రాథమికంగా అంగీకారం కుదిరినట్టు తెలుస్తోంది. అయితే.. ఇందుకు భిన్నంగా ఒడిశాకు చెందిన మద్యం వ్యాపారి వివేక్ సాహు ఏకంగా 30 షాపులకు దరఖాస్తు చేశారు. నోయిడాకు చెందిన వ్యాపారులు 10 షాపుల వరకూ దరఖాస్తు చేస్తున్నట్టు సమాచారంతో స్థానిక సిండికేట్ కంగుతింది. ఆయా వ్యాపారులకు లాటరీలో షాపులు దక్కితే... వాటిని ఏ విధంగా చేజిక్కించుకోవాలనే అంశంపై తాజాగా సిండికేట్ సభ్యులు చర్చలు జరుపుతున్నట్టు సమాచారం.

సిండికేట్ నేతృత్వంలో మార్పు.. కొత్త ఎమ్మెల్యే ప్రవేశం

విశాఖ మద్యం సిండికేట్ మొదటగా దరఖాస్తులు ఎక్కువ రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. ఇందుకోసం మద్యం వ్యాపారంలో ఉన్న ప్రధానమైన 8 మంది సిండికేట్‌గా ఏర్పడ్డారు. ఈ సిండికేట్ మొన్నటివరకు ముందుండి నడిపించిన ఎమ్మెల్యే స్థానంలో.. కొత్త ఎమ్మెల్యే సారథ్యం వహించేలా ప్రణాళిక రచించారు. తద్వారా షాపులకు ఎక్కువ పోటీ రాకుండా జాగ్రత్తపడ్డారు. మరోవైపు ఇప్పటికే ప్రభుత్వ మద్యం దుకాణం నడుస్తున్న భవనాల వద్ద వ్యవహారం మొదలుపెట్టారు. ఆయా భవన యజమానులతో మాట్లాడుకుని.. అవి తమకే వచ్చేలా చూసుకున్నారు. ఇందుకోసం ఎక్సైజ్ శాఖలోని కొద్ది మంది అధికారులు కూడా సహకరించినట్టు తెలుస్తోంది. ప్రభుత్వ మద్యం దుకాణాలున్న భవనాన్ని ఫలానా మద్యం వ్యాపారులకే అద్దెకు ఇవ్వాలని కొద్ది మంది అధికారులు చర్చలు జరిపారు. అలా అయితేనే మీకు పాత అద్దెలను సక్రమంగా వచ్చేలా చూస్తామని.. లేని పక్షంలో ఇబ్బందులు తప్పవని కొద్ది మందిని బెదిరించినట్టు తెలుస్తోంది. కాగా.. లాటరీ పూర్తయిన తర్వాత వ్యాపారులు షాపులను 12నే తెరిచేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అంతేకాకుండా ప్రధానమైన ప్రాంతాలన్నింటిలో తమ షాపులే ఉండేలా జాగ్రత్తపడ్డారు. ఒకవేళ ఎవరైనా కొత్తవాళ్లకు షాపులు వస్తే.. భవనాలు దక్కకుండా, ప్రధానమైన ప్రాంతాల్లో వారు వ్యాపారం చేయకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ పరిస్థితుల్లో ఒడిశా, నోయిడా నుంచి మద్యం వ్యాపారులు రంగంలోకి దిగడంతో ఒక్కసారిగా కంగుతిన్నారు.

విశాఖలో తక్కువ దరఖాస్తులు

ఉమ్మడి విశాఖ జిల్లాలో 331 మద్యం షాపులకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. ఇందులో విశాఖ జిల్లా పరిధిలోని 155 షాపులకుగానూ మంగళవారం సాయంత్రం 5 గంటల సమయానికి 878 దరఖాస్తులు వచ్చాయి. అంటే ఒక్కో షాపునకు సగటున 6 దరఖాస్తులు కూడా రాలేదు. అనకాపల్లి జిల్లాలో 136 షాపులకుగానూ 1,076 దరఖాస్తులు వచ్చాయి. అంటే ఒక్కో షాపునకు 8 దరఖాస్తులు వచ్చాయి. అల్లూరి జిల్లాలో 40 మద్యం షాపుల్లో 36 షాపులకు మాత్రమే దరఖాస్తులు రాగా... మరో 4 షాపులకు దరఖాస్తులు రాలేదు. 36 షాపులకు మొత్తం 330 దరఖాస్తులు వచ్చాయి. సాధారణంగా విశాఖలో మద్యం వ్యాపారానికి భారీగా డిమాండ్ ఉంటుంది. ఒక్కో షాపునకు కనీసం 40 నుంచి 50 మంది పోటీపడతారని ఊహించారు. ఇందుకు భిన్నంగా దరఖాస్తుల ప్రక్రియ ముగిసే సమయానికి సగటున 10 మందికి మించి పోటీపడే పరిస్థితులు కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఒడిశా, నోయిడాల నుంచి పోటీ రావడంతో సిండికేట్ సభ్యులు తర్జనభర్జన పడుతున్నారు. ఎలాగైనా వారికి షాపులు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఒక వేళ లాటరీలో షాపులు వస్తే వాటిని ఎలా చేజిక్కించుకోవాలనే విషయంపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి బ్యాంక్, ఏటీఎం సెక్యూరిటీ ఏజెన్సీ ప్రతినిధులకు సూచించారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఏటీఎంల్లో దొంగతనాలను అరికట్టడం, సైబర్ నేరాల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. ముందుగా ఏటీఎంల్లో చోరీ చేసే తీరును ఫొటోలు వీడియోలతో ప్రదర్శించారు. ఈ చోరీల నివారణకు తీసుకోవాల్సిన భద్రతా ప్రమాణాలైన సీసీ కెమెరాలు, అలారం సిస్టమ్, ప్రైవేట్ సెక్యూరిటీ, ఇతర అంశాలపై అవగాహన కల్పించి తక్షణం వాటిని అందుబాటులోకి తీసుకురావాలని సీపీ సూచించారు. నగరంలోని 654 ఏటీఎంల్లో భద్రతా సమస్యలు ఉన్న వాటిని గుర్తించి వాటి ప్రతినిధులకు అందజేశారు. అనంతరం సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పిస్తూ నేరం జరిగిన మొదటి గంటలోనే ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న నగదు మొత్తం తిరిగి వచ్చే అవకాశం ఉంటుందని వెల్లడించారు. అందుకు బ్యాంకు అధికారుల సహకారం కూడా అవసరమని తెలిపారు. సైబర్ నేరాలు జరిగిన వెంటనే నగదు బదిలీ అవుతున్న తీరు, ఏయే ప్రాంతాల నుంచి మోసాలకు పాల్పడుతున్నది, మ్యూల్ అకౌంట్లు నియంత్రించే విధానాలను వివరించారు. అలాగే అకౌంట్లు ఓపెన్ చేసేటప్పుడు కచ్చితంగా అన్ని నిబంధనలను అనుసరించాలని చెప్పారు. బ్యాంకులు, ఏటీఎం సెక్యూరిటీ ఏజెన్సీ ప్రతినిధుల సలహాలు, సమస్యలపై చర్చించారు. మరోసారి నగరంలో ఉన్న అన్ని బ్యాంకు, ఏటీఎం సెక్యూరిటీ ఏజెన్సీల జోనల్ హెడ్‌లతో సమన్వయ సమావేశం నిర్వహించి కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని సీపీ తెలిపారు.

800 కిలోల రేషన్ బియ్యం పక్కదారి

పౌర సరఫరా శాఖ సిబ్బంది చేతివాటం!

మహారాణిపేట: రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా నియంత్రించాల్సిన పౌర సరఫరాల శాఖ అధికారులే చేతివాటం ప్రదర్శించడం విమర్శలకు తావిస్తోంది. నగరంలోని సీతంపేట, శాంతిపురం ప్రాంతాల్లో సోమవారం రాత్రి 800 కిలోల బియ్యాన్ని కొంత మంది తరలిస్తున్నారు. ఈ సమాచారంతో ఇద్దరు ఆ శాఖ ఉద్యోగులు దాడులు చేసి పట్టుకున్నారు. ఆ బియ్యాన్ని పరిశీలించి పీడీఎస్ బియ్యంగా గుర్తించారు. అయితే ఆ బియ్యాన్ని తరలిస్తున్న వారిపై కేసు పెట్టకుండా.. వారితో బేరసారాలకు దిగినట్లు సమాచారం. వారిపై ఎలాంటి కేసు లేకుండా చేతివాటం ప్రదర్శించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

విశాఖ-రాయ్‌పూర్ పాసింజర్ వేళల్లో మార్పులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–రాయ్‌పూర్ పాసింజర్ వేళల్లో మార్పులు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం–రాయ్‌పూర్(08528) పాసింజర్ స్పెషల్ ఈ నెల 20 నుంచి ఉదయం 4.25 గంటలకు బదులుగా ఉదయం 6.30 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి, అదే రోజు రాత్రి 7.45 గంటలకు రాయ్‌పూర్ చేరుకుంటుంది.

'సాయి గణపతి' విద్యార్థుల ఆందోళన

క్యాంటీన్ నిర్వహణపై ఫిర్యాదు



చట్నీలో ఈగలు

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీలోని సాయి గణపతి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన క్యాంటీన్‌లో పరిసరాలతో పాటు ఆహారం బాగా లేదని మంగళవారం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఆందోళన చేశారు. పరిశుభ్రత లేని కారణంగా బ్యాక్టీరియా వ్యాపించి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. అన్నం సరిగ్గా వండటం లేదని, తాగే నీళ్లలో క్రిములు ఉంటున్నాయన్నారు. శుభ్రం చేయని ప్లాస్టిక్ గ్లాసులు, బాటిళ్లు వినియోగిస్తున్నట్లు తెలిపారు. డైనింగ్ టేబుళ్లు గలీజుగా ఉంటున్నాయన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే చాలాసార్లు కళాశాల యాజమాన్యం, క్యాంటీన్ మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. అయినప్పటికీ చర్యలేవీ తీసుకోలేదన్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రమాణాలేవీ పాటించనందున వారి దృష్టికి కూడా క్యాంటీన్ విషయాలు తీసుకువెళతామన్నారు. ఈ విషయాన్ని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మహేష్‌కుమార్ దృష్టికి తీసుకురాగా వారానికి ఒకసారి తాను క్యాంటీన్‌ను తనిఖీ చేస్తానన్నారు. ఈ విషయంపై విద్యార్థులెవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. బుధవారం క్యాంటీన్‌ను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



కోనసీమ పేరు వినగానే..మనకు వెంటనే గుర్తుకొచ్చేది కొబ్బరి చెట్లు. కోనసీమకు సొగస్సును అద్దే ఈ కొబ్బరి చెట్లు.. లక్షలాది రైతులకు జీవనాధారం. మరి మన భీమిలి తీర ప్రాంతం కూడా కొబ్బరికి పుట్టినిల్లుగా మారిపోయింది. ఇక్కడ కూడా కోనసీమ మాదిరిగానే కొబ్బరి సాగు చేస్తున్నారు. లాభాలూ గడిస్తున్నారు..పలువురికి ఉపాధీ చూపిస్తున్నారు. వివిధ రాష్ట్రాలకు ఎగుమతీ చేస్తున్నారు. భీమిలి తీరప్రాంతంలో కొబ్బరి నీళ్లు రుచి చూస్తే ఆహా అనాల్సిందే. అందుకే ఇక్కడి కొబ్బరి బొండాలకు అంత క్రేజ్. –తగరపువలస



భీమిలి కొబ్బరికి యమ క్రేజ్

ఉత్తరాదిలో డిమాండ్ ■ 3070 ఎకరాల్లో సాగు ■ రైతులకు లాభాల పంట

భీమిలి తీరప్రాంత కొబ్బరినీటికి ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు ఫిదా అవుతున్నారు. దీంతో మండలంలోని అన్నవరం, అమనాంతో పాటు వీటిని ఆనుకుని భోగాపురం మండలంలోని తూడెం, బసవపాలెం, రావాడ, కవులవాడ, జమ్మయ్యపేట, మరడపాలెం పంచాయతీల నుంచి ప్రతిరోజూ 30 వేల వరకు బొండాలు ఎగుమతి అవుతున్నాయి. అచ్యుతాపురం మండలంలోని ఎస్.రాయవరం కొబ్బరి బొండాలు తేలికగా ఉండి ధర తక్కువ. కానీ భీమిలి తీరంలో లభించే బొండాలు బరువుగా ఉండటంతో కనీసం 250 ఎంఎల్ నుంచి 750 ఎంఎల్ నీటిని అందిస్తున్నాయి. దీంతో వ్యాపారులు భీమిలి కొబ్బరి బొండాలపై దృష్టి సారిస్తున్నారు. వీటి ధర రూ.25 పలుకుతుండగా రైతులకు రూ.20 ఇచ్చి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మిగిలిన రూ.5లో గెలలతీత, మోత కూలీకి రూ.3, మరో రూ.2 ఇతరాత్ర ఖర్చు చేస్తున్నారు. వీటిని నగరానికి చెందిన మధ్యవర్తులు మహారాష్ట్ర, బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా తదితర రాష్ట్రాలకు ప్రతిరోజూ ఎగుమతి చేస్తున్నారు.

45 రోజుల్లో నీటి బొండాలు దిగుబడి వస్తుండగా.. రైతుకు రూ.20 చేతికి అందుతోంది. అదే గుజురు కాయలకోసమైతే మూడు నెలలు వేచి ఉండాలి. రూ.15 కూడా రావడం కష్టంగా ఉంటుంది. దీంతో ఈ ప్రాంత రైతులంతా నీటి బొండాలనే దించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడ గంగాభవాని, ఈస్ట్‌కోస్టల్, చెంగల్వతో పాటు దేశవాళీ రకాల బొండాలు, ప్రసిద్ధమైన నారు లభిస్తాయి. ఒక్కో మొక్కను రైతులు రూ.120 వరకు విక్రయిస్తున్నారు.



ఎగుమతి సిద్ధంగా కొబ్బరి బొండాలు

కొబ్బరి చెట్టును నమ్ముకుంటే..

కొడుకును నమ్ముకునే కంటే కొబ్బరిచెట్లను నమ్ముకోవడం మేలన్న సామెతను ఇక్కడి రైతులు ఆచరిస్తున్నారు. ఈ తీరంలో భీమిలి మండలానికి సంబంధించి 570, భోగాపురం మండలంలో 2,500 ఎకరాల వరకు కొబ్బరి తోటలు ఉన్నాయి. ఇక్కడి రైతులు ఎకరానికి 60 నుంచి 100 వరకు చెట్లను పెంచుతున్నారు. ఒక్కో చెట్టుకు 45 రోజుల్లో రెండు గెలల నుంచి గరిష్టంగా 50 బొండాల ద్వారా రూ.1000 ఆదాయం లభిస్తుంది. ఇలా ఏడాదిలో 9 విడతల్లో ఎకరానికి రూ.5 లక్షలకు పైగా ఆదాయం లభిస్తుంది. రెండేళ్ల క్రితం తెల్లదోమ కారణంగా రైతుల ఆదాయం మూడో వంతుకు పడిపోయింది. ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో కురిసిన వర్షాల వలన రైతుకు మేలు జరిగి తెల్లదోమ మటుమాయం అయింది.



నీళ్ల బొండాలే విక్రయిస్తున్నాం



నీళ్ల బొండాల ఆదాయమే బాగా ఉండటంతో ఈ ప్రాంత రైతులంతా వీటినే 45 రోజులకు ఒకసారి విక్రయిస్తున్నారు. పూజలకు ఉపయోగించే కొబ్బరి ఉభయగోదావరి జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీని కోసం చెట్లకు బాగా నీరు పెట్టాలి.

–చిలుకోటి నాగరాజు, రైతు, భీమిలి

ఆదాయం బాగుంది



మేము పెట్టుబడి పెట్టి రైతుల నుంచి బొండాలను రూ.20 వంతున కొనుగోలు చేస్తుంటాం. ఖర్చులు పెట్టి నగరానికి చెందిన మధ్యవర్తుల ద్వారా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటాం. కొనుగోలుదారులే వచ్చి సరుకు పట్టుకుపోతారు.

–ఒసుం కన్నమ్మ, రైతు, తూడెం

800 మందికి ఉపాధి



కొబ్బరితోటల్లో సాగు, కొబ్బరి బొండాలు దించడం, మోత కూలి, చీపుళ్ల తయారీ, పీచుతో తాళ్లు, థియేటర్లలో షీట్లు తయారు వంటి పనులలో 800 మంది వరకు నిత్యం ఉపాధి పొందుతున్నారు.

–పూర్ల రామసూరి, బసవపాలెం

రూ.29 కోట్లతో 322 పనులు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 'పల్లె పండగ'వారోత్సవాల నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీసీ హాలు నుంచి ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమైన కలెక్టర్ మాట్లాడారు. రూ.29.04 కోట్ల అంచనాతో గ్రామ సభల్లో గుర్తించిన 322 పనులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఇప్పటి వరకు రూ.21.09 కోట్ల బడ్జెట్ అంచనాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్లు వెల్లడించారు. పల్లె పండగ నిర్వహణకు అధికారులందరినీ సంసిద్ధం చేసినట్లు వివరించారు. నిర్మాణాలకు అవసరమైన ఇసుకను పక్క జిల్లాల నుంచి తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందుకోసం తూర్పుగోదావరి, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల పరిధిలో 27 అదనపు రీచ్‌లు కేటాయించారని డిప్యూటీ సీఎంకు వివరించారు. జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, డీపీవో శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జుల ఏలు'బడి'లో!

- మాతృ సంస్థకు సమగ్ర శిక్ష ఏపీసీ
- పర్యవేక్షణాధికారులకూ ముగిసిన డిప్యూటేషన్ల గడువు
- రెగ్యులర్ అధికారులు లేక గాడితప్పుతున్న పాలన
- విద్యా కార్యక్రమాలపై పర్యవేక్షణ కరువు
- ఏపీసీ పోస్టు కోసం కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణలు



విశాఖలోని సమగ్ర శిక్ష కార్యాలయం

విశాఖ విద్య: జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్(ఏపీసీ)గా పనిచేస్తున్న శ్రీనివాసరావును ఆయన మాతృసంస్థ(పంచాయతీ రాజ్ శాఖ)కు పంపిన ప్రభుత్వం.. ఆ పోస్టులో ఎవరినీ నియమించలేదు. డీఈవో చంద్రకళ ఇన్‌చార్జి ఏపీసీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సమగ్ర శిక్ష కార్యాలయంలోని కొంత మంది సెక్టోరియల్ అధికారుల డిప్యూటేషన్ల గడువు ముగిసింది. వీరిని కొనసాగిస్తారా..? లేదా అనే సందేహాలు ఉన్నాయి. విశాఖపట్నం, భీమునిపట్నం డిప్యూటీ డీఈవో పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి. చినగదిలి ఎంఈవోగా పని చేస్తున్న రవీంద్రబాబు, ఆనందపురం ఎంఈవో–1గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తుండగా.. ఇదే అధికారి విశాఖ, భీమిలి ఇన్‌చార్జి డిప్యూటీ డీఈవోగా కూడా వ్యవహరిస్తున్నారు. ఇలా కీలకమైన పోస్టుల్లో ఇన్‌చార్జులు ఉండటంతో విద్యాశాఖ కార్యక్రమాలపై పర్యవేక్షణ కరువైంది. ఫలితంగా బడుల్లో నాణ్యమైన విద్య దూరమవుతోంది.

విద్యాశాఖలో 'సమగ్ర శిక్ష' కీలకం

పాఠశాల విద్యా కార్యక్రమాల అమలులో సమగ్ర శిక్ష అభియాన్ విభాగం కీలకంగా వ్యవహరిస్తుంది. బడి ఈడు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్య అందించడం, అభ్యసన ఫలితాలు మెరుగుపరచడం, ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్య శిక్షణ అందించడం, ప్రత్యేక అవసరాల పిల్లల కోసం భవిత కేంద్రాల నిర్వహణ, బాలిక విద్య ప్రోత్సహించే క్రమంలో కస్తూర్బా గాంధీ విద్యాలయాల నిర్వహణ, మౌలిక వసతుల కల్పన, పాఠశాలల నిర్వహణ గ్రాంట్లు, విద్యా కానుకల పంపిణీ.. ఇలా సమస్త కార్యక్రమాలను సమగ్ర శిక్ష అధికారులే పర్యవేక్షణ చేయాల్సి ఉంది. వీటికి సంబంధించిన ప్రగతి నివేదకలను ప్రభుత్వానికి ఇదే కార్యాలయం నుంచి పంపించాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం పూర్తిస్థాయి అధికారులు లేకపోవడంతో అంతా స్తబ్దత నెలకొంది.

పునరావాస కేంద్రంగా సమగ్ర శిక్ష

సమగ్ర శిక్ష అభియాన్‌కు శాంక్షన్ పోస్టులు లేకపోవడంతో ఇదో పునరావాస కేంద్రంగా మారింది. డబ్బులతో ముడిపడిన విభాగం కావడంతో వీటిని చూసేందుకని ట్రెజరీ శాఖ నుంచి ఏటీవో హోదా గల ఎం.భారతి డిప్యూటేషన్‌పై ఇక్కడ అడ్మినిస్ట్రేషన్ అధికారి(ఏవో)గా పనిచేస్తున్నారు. ఆమెకు అసిస్టెంట్‌గా జూనియర్ అకౌంట్ ఆఫీసర్ పోస్టులో సీనియర్ అసిస్టెంట్ క్యాడర్ గల ఉద్యోగి ఉంటే సరిపోతుంది. కానీ ఇక్కడ ట్రెజరీ శాఖ నుంచి ఎస్టీవో హోదా గల సోమినాయుడు డిప్యూటేషన్‌పై కొనసాగుతుండటం గమనార్హం. అకడమిక్, గణాంక, జీసీడీవో వంటి జిల్లా స్థాయి పోస్టుల్లో గెజిటెడ్ హోదా గల వారు ఉండాలి. కానీ స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ గల ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న వారిని తప్పించి.. ఆ సీట్లను చేజిక్కించుకునేందుకు కొంతమంది ఉపాధ్యాయులు కూటమి నేతలను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఇలాంటి పరిణామాలతో సమగ్ర శిక్ష కార్యాలయం కొంత మందికి పునరావాస కేంద్రంగా మారిపోతోంది.

ఏపీసీ పోస్టుకు యమ గిరాకీ

విద్యాశాఖ కార్యక్రమాల అమల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి ఏటా జిల్లాకు సుమారుగా రూ.100 కోట్లకు పైగానే నిధులు కేటాయింపులు ఉంటాయి. ఈ ఆర్థిక లావాదేవీలన్నీ సమగ్ర శిక్ష ఏపీసీ అజమాయిషీలోనే సాగుతాయి. చివరకు డీఈవోకు టీ, స్నాక్స్‌కు బడ్జెట్ కావాలన్నా సమగ్ర శిక్ష కార్యాలయం నుంచే విడుదల చేయాలి. ఆర్థిక లావాదేవీలతో ముడిపడింది కావడంతో ఈ పోస్టులోకి వచ్చేందుకు పలువురు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలోనే ఏపీసీ పోస్టుల భర్తీ ఉంటుందనే ప్రచారం సాగుతుండటంతో.. దీన్ని ఆశిస్తున్న వారంతా కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

బోధనేతర పనులకు టీచర్లు వద్దు

విద్యాశాఖలో ఖాళీగా ఉన్న అధికారుల పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా తక్షణమే భర్తీ చేయాలి. సమగ్ర శిక్ష, ఇతర కార్యాలయాల్లో ఉన్న ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను రద్దు చేసి, స్కూళ్లకు పంపించాలి. ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించవద్దు.

– టి.ఆర్.అంబేద్కర్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

రోడ్డు ప్రమాదంలో దివీస్ ఉద్యోగి దుర్మరణం



ఘటనా స్థలంలో రాంబాబు మృతదేహం



రాంబాబు(ఫైల్)

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ సిటీనగర్ వద్ద యూనియన్ బ్యాంకు ఎదురుగా మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో శెట్టి రాంబాబు అనే దివీస్ ఉద్యోగి దుర్మరణం చెందాడు. నైట్ డ్యూటీకి వెళ్లిన రాంబాబు విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ముందున్న ట్రాక్టర్‌ను దాటి వెళ్లే ప్రయత్నం చేశాడు. ఇంతలో ఎదురుగా లారీ వస్తుండటంతో వెనక్కు తగ్గే క్రమంలో ట్రాక్టర్ వెనుక భాగం బలంగా తగిలి రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్ర రక్తస్రావం కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన మృతుడు ఏడేళ్ల క్రితం దివీస్‌లో చేరాడు. ప్రస్తుతం బాలాజీనగర్‌లో నివసిస్తున్నాడు. అతనికి భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. భీమిలి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఆయన స్వగ్రామానికి తరలించారు. అతని మృతితో తోటి ఉద్యోగులు దుఃఖంలో మునిగిపోయారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం అమలు, నిర్వహణ తీరుపై మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పథకాన్ని మరింత పక్కాగా అమలు చేయాలని, వంటకాల రుచి, ఆహార నాణ్యత విషయంలో పిల్లల అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. ఉదయం రాగిజావ, ఇంటర్వెల్ తర్వాత చిక్కీ ఇవ్వాలని సూచించారు. ఉపాధ్యాయులు, స్పెషల్ అధికారులు, తనిఖీ బృందాల అధికారులు నిర్వహణ లోపాలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఆహారం తయారు చేసే ఏజెన్సీలకు నాణ్యమైన సరకులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. కిచెన్ గార్డెన్ విధానాన్ని ప్రోత్సహించాలని, విద్యార్థులకు హెల్త్ స్క్రీనింగ్ టెస్టులు తరచూ చేయాలని సూచించారు. జిల్లాలో 581 పాఠశాలల్లో పథకం అమలవుతుందని, వాటిలో 315 పాఠశాలలకు అక్షయ పాత్ర, 266 పాఠశాలలకు కుకింగ్ ఏజెన్సీ ద్వారా ఆహారం అందిస్తున్నామని డీఈవో చంద్రకళ వివరించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, ఐసీడీఎస్ పీడీ జయదేవి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విజయలక్ష్మిగా కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం కనక మహాలక్ష్మి అమ్మవారు విజయలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి గులాబీపూలతో పూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం విద్యాలక్ష్మిగా అమ్మవారు దర్శనమివ్వనున్నారని ఈవో శోభారాణి తెలిపారు.

రైల్వే ప్రయాణికుల భద్రతకు చర్యలు

తాటిచెట్లపాలెం: పండగ నేపథ్యంలో రైల్వే ప్రయాణికుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని.. పలు రైళ్లకు అదనపు కోచ్‌లు జత చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక టికెట్ కౌంటర్లు, క్యూ ఆర్ కోడ్ ఆధారిత టికెట్లు, ఏటీవీఎం, వైటీఎస్‌కే వంటి అదనపు వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రయాణికుల కూడా సంబంధిత అధికారులు, రైల్వే సూచనలు పాటించాలని సూచించారు. సరైన టికెట్లు లేకుండా రిజర్వేషన్ బోగీల్లో ప్రయాణించరాదని, నిషేధిత వస్తువులను తీసుకు వెళ్లరాదన్నారు. ఇటువంటివి ఏమైనా తోటి ప్రయాణికులు గమనిస్తే వెంటనే రైల్వే అధికారులకు తెలియజేయాలని కోరారు.



విదేశీ నౌకల సందడి



మలబార్-2024 విన్యాసాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 18వ తేదీ వరకు హార్బర్, సీ ఫేజ్ దశల్లో విన్యాసాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా విశాఖ తీరంలో విదేశీ యుద్ధ నౌకలు సందడి చేశాయి. ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



స్వాగత నృత్యం!

మలబార్ విన్యాసాల కోసం విశాఖ తీరానికి చేరుకున్న విదేశీ యుద్ధ నౌకలను ఈ బాలిక తన నృత్యంతో స్వాగతం పలుకుతున్నట్లు ఉంది కదూ ఈ చిత్రం. మంగళవారం సాయంత్రం దుర్గాదేవి ఆలయంలో నృత్య ప్రదర్శనకు వెళుతున్న బాలిక.. బీచ్‌రోడ్డులో కొంత సేపు తల్లి పర్యవేక్షణలో సాధన చేసింది. ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది. ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

చాప కాదు.. ఎండు చేప!



మత్స్యకారులు చేపలను ఎండబెట్టే విధానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా బోటుపైనే చేపలను అమర్చి ఎండబెట్టే పద్ధతిని విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో కొందరు అనుసరిస్తున్నారు. సముద్రంలో వేటాడే సమయంలో లభించే చిన్న చేపలను తాళ్లకు కట్టి పడవ పైభాగంలో అమర్చుతారు. సూర్యరశ్మి సమానంగా పడేలా వీటిని అమర్చడం వల్ల త్వరగా ఎండి, రుచికరంగా ఉంటాయని మత్స్యకారులు చెబుతున్నారు. దీని వల్ల చేపలు నాణ్యతను కోల్పోవని, ఇతర పద్ధతుల కంటే తక్కువ సమయంలో ఎండబెట్టడం సాధ్యమవుతుందని అంటున్నారు. ఈ విధంగా సిద్ధం చేసిన ఎండు చేపలను స్థానికంగా విక్రయించడంతో పాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం